వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 246
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
జూలై 01, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




గడ్డం కేశవమూర్తికి ఘన సన్మానం

8లో..

# పరువు తీస్తున్నారు



వివరాలు2లో..

- బల్దియాలో 'సీసీ'ల లీలలు
- వారితో ఐఏఎస్ లకు చెడ్డపేరు
- కమిషనర్లు మారినా వారికి స్థానచలనం ఉండదు
- పైసలిస్తేనే ఫైళ్లు ముందుకు
- పాత తేదీలతో సంతకాలు

ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి, ఎంతో కష్టపడి ఐఏఎస్ పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో విధుల్లో చేరితే అక్కడ కొన్ని ఏండ్లుగా పాతుకుపోయిన క్యాంప్ క్లర్క్ (సీసీ)లు వారిని తప్పదోవ పట్టిస్తూ పరువుతీస్తున్నారు. ఇదే పరిస్థితి వరంగల్ మహా నగర పాలక సంస్థలో నెలకొంది. ఎన్నో ఆశలతో కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారులకు మాయ మాటలు చెబుతూ వారిని ప్రజలకు, కింది స్థాయి ఉద్యోగులకు దూరం చేయడంలో ఇక్కడ సీసీలుగా పనిచేస్తున్న ఎండి.సమద్, వినయ్ లు గత కొన్ని ఏళ్లుగా విజయం సాధిస్తున్నారనే చెప్పవచ్చు. కమిషనర్ సీసీగా గత పదేళ్లుగా ఇక్కడే పాతుకుపోయిన సమద్ కు పట్ట పగ్గాలు లేకుండా పోయాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బల్దియాలో ఆయన ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతోంది. పైసలిచ్చిన వారి ఫైళ్లనే కమిషనర్ ముందుకు పంపడంతో పాటు పాత తేదీలతో సంతకాలు చేయించడంలో సీసీలు ఆరితేరినట్లు ఆరోపణలున్నాయి. కొత్తగా బల్దియా కమిషనర్ గా విధుల్లో చేరిన చాహత్ బాజ్ పాయ్ ని కూడా సీసీలు ట్రాప్ లో పడేసి ప్రజలకు, అధికారులకు దూరం చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. అందులో భాగంగానే కమిషనర్ ను కలిసేందుకు వచ్చిన వారికి ఏదో ఒక సాకు చెబుతూ ఆమెను కలువకుండా చేస్తున్నట్లు పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. సీసీలు ఇదే ఒరవడి కొనసాగిస్తే ఈ కమిషనర్ కు కూడా చెడ్డపేరు రావడం గ్యారెంటీ అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. - వరంగల్ వాయిస్ ప్రతినిధి



## మహావజ్రేశ్వరి క్రమంలో అమ్మవారు

- ఆరో రోజుకు చేరిన శాకంబరి

నగరంలోని సుప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంబరీ నవరాత్ర మహోత్సవాలు మంగళవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. దీంతో అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తి కాళీ క్రమాన్ని అనుసరించి 'విప్రచిత్తా' నిత్యాగాను షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని 'మహావజ్రేశ్వరి' గాను అలంకరించి పూజారాధనలు నిర్వహించారు. విప్రచిత్తా అమ్మవారు బ్రాహ్మణుల బుద్ధియందు ప్రవేశించి బ్రాహ్మణులు వేదోక్త తత్త్వజ్ఞానంతో కూడిన వేదవిహిత కర్మలను ఆచరించే విధంగా చేసి తద్వారా అగ్నిష్టోమాది శ్రాతయాగాలు జరుపుచూ తద్వారా సకల జనులు తరించే విధంగా చేస్తుందని, అట్లాగే మహావజ్రేశ్వరీ మాత సాధకుడి సంకల్పాలను వజ్రసంకల్పంగా ధృఢతరం చేసి మనిషిని సాధనలో కృతకృత్యుణ్ణి చేసి ఆత్మోద్ధరణ జరుపుతుందని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఈ విధంగా లోకకళ్యాణం జరుగుతుందన్నారు. అమ్మవారి దర్శనమునకు విచ్చేయు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, ఉచిత ప్రసాద వితరణ ఏర్పాట్లను దేవాలయ ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మోతుకూరి మయూరి రామేశ్వర్రావు, గాండ్ల స్రవంతి, బింగి సతీష్, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శేషుభారతి పర్యవేక్షించారు.

– వరంగల్ వాయిస్, వరంగల్



2లో..

## డ్రైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టండి

- నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్ తో కలిసి పోతన జంక్షన్, బీట్ బజార్ పరిశీలన


## డిఫాల్టర్ రైస్ మిల్లర్స్ పై యాక్షన్

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద | పలు అంశాలపై కలెక్టరేట్ లో సమీక్ష




8లో..

# పరువు తీస్తున్నారు



- బల్దియాలో 'సీసీ'ల లీలలు
- వారితో ఐఏఎస్ లకు చెడ్డపేరు
- కమిషనర్లు మారినా వారికి స్థానచలనం ఉండదు
- పైసలిస్తేనే ఫైళ్లు ముందుకు
- పాత తేదీలతో సంతకాలు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఒక ఐఏఎస్ అధికారి ప్రజలతో మమేకం అయితేనే వారి సమస్యలు తెలుసుకోవడం ఈజీ అవుతుంది. అదే విధంగా కింది స్థాయి ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఇలా ప్రతి ఒక్కరితో ఎప్పటికప్పుడు కలుస్తూ వారి సాదకబాధకాలను తెలుసుకోవాల్సిన అవసరం, వాటికి పరిష్కార మార్గాలు చూపించాల్సిన బాధ్యత సదరు ఐఏఎస్ అధికారిపై ఉంటుంది. అప్పుడే ఆ అధికారికి గుర్తింపు లభిస్తుంది. అయితే వరంగల్ మహా నగర పాలక సంస్థలో మాత్రం ఇందుకు బిన్నంగా సాగుతోంది. కొత్తగా బల్దియా కమిషనర్ గా విధుల్లో చేరిన చాహత్ బాజ్ పాయ్ ని ఆమె సీసీలుగా పనిచేస్తున్న ఎండి. సమద్, వినయ్ ట్రాప్ లో పడేసి పక్కదారి పట్టిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. వీరిద్దరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కమిషనర్ ను కలిసేందుకు వచ్చిన వారెవరైనా లెక్కేలేదన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు.

## పదేళ్లుగా ఇక్కడే..

పదేళ్లక్రితం మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వర్తించిన సర్ఫరాజ్ అహ్మద్ బల్దియాలో సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న ఎండి.సమద్ ను కమిషనర్ సీసీగా తీసుకున్నారు. అప్పటి నుంచి అదే సీటులో పాతుకుపోయిన సమద్ బల్దియాలో తను ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. కమిషనర్ గా సర్ఫరాజ్ అహ్మద్ తర్వాత గ్రేటర్ కమిషనర్లుగా ఐఏఎస్ అధికారులు శృతి ఓజా, వీపీ గౌతం, రవికిరణ్, పమేలా సత్పతి, రిజ్వాన్ భాషా, పి.ప్రావీణ్య, ఇటీవల బదిలీ అయిన డాక్టర్ అశ్విని తానాజీ వాకడేలకు కూడా ఎండి.సమద్ సీసీగా వ్యవహరించారు. కొత్తగా గ్రేటర్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్ పాయ్ కి కూడా ఆయనే సీసీగా కొనసాగుతున్నారు.

## అన్వేష్ ను మించిపోయారు..

గతంలో కమిషనర్ సీసీగా పనిచేసి, సస్పెండ్ అయిన అన్వేష్ ను ప్రస్తుత సీసీలు సమయద్, వినయ్ లు మించిపోయారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత పదేళ్లుగా సీసీగా కొనసాగుతున్న ఎండి. సమద్ కు వినయ్ తోడు కావడంతో బల్దియాలో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. ఎప్పుడు ఏ కమిషనర్ బదిలీ అయినప్పటికీ పాత తేదీల్లో ఫైళ్లపై సంతకాలు పెట్టిస్తూ పెద్ద మొత్తంలో దండుకుంటున్నట్లు విమర్శలున్నాయి. పర్సంటేజీలు ఇచ్చిన వారి ఫైళ్లను క్లియర్ చేయిస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో వీరి పెత్తనం ఎక్కువైందన్న ఆరోపణలున్నాయి. అకౌంట్స్,




ప్లానింగ్, ఇంజినీరింగ్ తో పాటు వివిధ సెక్షన్లలో వీరు మితిమీరి ప్రవర్తిస్తున్నట్లు సమాచారం.

## అడ్డంకులు..

కార్పొరేటర్లు, వివిధ పార్టీల బాధ్యులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, విలేఖరులతోపాటు కింది స్థాయి సిబ్బందిసైతం వివిధ పనుల నిమిత్తం కమిషనర్ కు కలిసేందుకు వస్తే సీసీలు సమద్, వినయ్ కుంటి సాకులు చెబుతూ వారిని కలువకుండా చేస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. కమిషనర్ మీటింగ్ లో ఉన్నారు.. వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు.. క్షేత్ర స్థాయి పర్యటనలో ఉన్నారంటూ తప్పుడు సమాచారం ఇస్తూ వారిని రిటర్న్ పంపుతున్నారు. ఎవరైనా ఫోన్లు చేస్తే వాటిని ఎత్తడం లేదు.. కనీసం తిరిగు సమాధానం కూడా ఇవ్వడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

## దండుకుంటున్నారు..

నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను క్లియర్ చేస్తూ కమిషనర్ సంతకం చేస్తే అది తామే చేయించామంటూ గొప్పలు చెప్పుకుంటూ అందిన కాడికి దండుకుంటున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పర్సంటేటీజీలు ఇచ్చిన కాంట్రాక్టర్ల ఎంబీలు తీసుకెల్లి సంతకాలు పెట్టిస్తున్నట్లు సమాచారం. ఎవరు కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన వారిని 'కాకా' పడుతూ సీటును పదిలం చేసుకుంటున్నారన్న ప్రచారం సాగుతోంది. సమద్ తన సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్లు, అధికారులను మచ్చిక చేసుకొని పబ్బం గడుతున్నట్లు చెప్పుకొంటున్నారు. ప్రస్తుత కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ వద్దకూడా ఇద్దరు సీసీలు నంగనాచి వేషాలు వేస్తున్నట్లు ప్రజా సంఘాల బాధ్యులు ఆరోపిస్తున్నాయి. తమనుంచి పర్సంటేజీలు గుంజినా విశ్వాసం చూపకుండా వారి ఫోన్లనే ఎత్తనంత స్థాయికి ఎదిగిపోయారంటున్నారు.

## విచారణ జరిపించాలి..

గత పది సంవత్సరాలుగా సీసీగానే తిష్ఠ వేసి అందిన కాడికి దండుకుంటున్న ఎండి.సమద్, వినయ్ ల అవినీతిపై నిఘా సంస్థలు దృష్టి సారించాలని ప్రజా సంఘాల బాధ్యులు కోరుతున్నారు. అదే విధంగా కమిషనర్ సీసీల దందాలపై కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, మేయర్ గుండు సుధారాణి దృష్టి సారించాలంటున్నారు. అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే సస్పెండ్ చేయాలని కోరుతున్నారు. అదే విధంగా పది సంవత్సరాలుగా ఒకే సీటులో పాతుకు పోయిన వారిని వెంటనే అక్కడి నుంచి తప్పించి ఐఏఎస్ అధికారులు పరువు నిలుపాలంటున్నారు.



# డ్రైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టండి

- నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్ తో కలిసి పోతన జంక్షన్, బీట్ బజార్ పరిశీలన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మురుగు నీరు నిలిచిపోకుండా డ్రైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి వరంగల్ ప్రాంతంలోని పోతన నగర్ జంక్షన్, 12 మోరీల ప్రాంతంతో పాటు బీట్ బజార్, మేదరి వాడ, నవీన్ టాకీస్ ప్రాంతాల్లో శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ హంటర్ రోడ్డులోని 12 మోరీల ప్రాంతాన్ని విస్తరించాలని, బీట్ బజార్ లో కల్వర్టు నిర్మించాలని, 12 మోరీల వరకు డ్రైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు. నవీన్ థియేటర్ సమీపంలో నిర్మిస్తున్న కల్వర్టు పనులను పరిశీలించారు. ఇదే ప్రాంతంలో చేతి పంపు పనిచేయడం లేదని స్థానికుల ఫిర్యాదు మేరకు మరమత్తులు చేయించాలని మేయర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డ్రైన్ ల ఔట్ ఫ్లో బయటకు వెళ్ళేలా చూడాలని, వర్షాకాలం నేపథ్యంలో డ్రైన్ ను ఎప్పటికపుడు క్లీన్ గా ఉంచుతూ వర్షం నీరు సులువుగా వెళ్లిపోయేలా చూడాలన్నారు. వర్షపు నీరు నిలువ ఉండకుండా లెవెల్స్ సరి చూడాలని బీట్ బజార్ ప్రాంతంలో డ్రైన్ సమస్యను పరిష్కరించాలని మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈలు శ్రీనివాస్, రవి కుమార్, ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, టీపీఎస్ లు యెర్షాద్ అనిల్, డీఈ రాజ్ కుమార్, ఏఈలు రాగి శ్రీకాంత్, హబీబ్, సానిటరీ ఇన్ స్పెక్టర్ శ్యామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు

- కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- క్షేత్ర స్థాయిలో తనిఖీలు
- రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా విధించాలంటూ ఆదేశం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పారిశుధ్య నిర్వహణలో అలసత్వం లేకుండా చూడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం హనుమకొండ పరిధిలోని 31, 7, 8 డివిజన్ లలో శానిటేషన్ తనిఖీలతో పాటు వడ్డేపల్లి బండ్ పై స్మార్ట్ సిటీ పనులు, ప్రశాంత్ నగర్ లోని 15 ఎంఎల్ డి సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను కమిషనర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా హనుమకొండ మెయిన్ రోడ్డు, చౌరస్తా ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో డిసిల్టేషన్ ప్రక్రియ నిరంతరం జరగాలని మెష్ (జాలీ) లు ఏర్పాటు చేయాలని, ఆక్రమణలకు పాల్పడకుండా చూడాలన్నారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే పెనాల్టీలు విధించడం, తొలగించడం చేయాలన్నారు. రోడ్డుమీద చెత్త వేస్తే జరిమానాలు విధించాలని ఆదేశించిన కమిషనర్ నిబంధనలు ఉల్లంఘించి చెత్త వేసిన టీ స్టాల్ యజమానికి రూ.10 వేలు జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య సిబ్బంది తప్పకుండా రెయిన్ కోట్లు ధరించాలని, సమయపాలన పాటించడంతో పాటు నాలుగుసార్లు థంబ్ వేయాలన్నారు. వడ్డేపల్లి బండ్ ను సందర్శించి అభివృద్ధి పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, హెచ్ఓ రమేష్, ఈఈ రవికుమార్, డీఈ కార్తీక్ రెడ్డి, ఏఈ మేనక, సానిటరీ సూపర్ వైజర్ నరేందర్, శానిటరీ ఇన్ స్పెక్టర్ అనిల్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.



# రెండ్ల సతీష్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

- దళితుడైన బరిగెల సుధాకర్ కు న్యాయం చేయాలి
- సతీష్ రెడ్డి పాస్ పోర్టును రద్దు చేయాలి
- ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** నిరుపేద దళిత మాదిగ సామాజిక వర్గానికి చెందిన బరిగెల సుధాకర్ భూమిని కబ్జా చేసిన భూకబ్జాదారుడైన రెండ్ల సతీష్ రెడ్డి పై కఠిన చర్యలు తీసుకొని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. ధర్మసాగర్ మంగళవారం మండలంలోని ధర్మపురం గ్రామంలో బరిగెల సుధాకర్ కు చెందిన కబ్జాకు గురైన భూమిని దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 382లో నిరుపేద దళితుడైన బర్గాల కుమారస్వామి పట్టాదారైనా గర్దాసు వెంకటమ్మ నుంచి ఆరు గంటల భూమిని విక్రయించాడని ఈ భూమిపై కన్నేసిన భూకబ్జాదారుడైనా రెండ్ల సతీష్ రెడ్డి తన తల్లి అయిన రెండ్ల కవిత పేరు మీద అక్రమంగా, తప్పుడు పత్రాలతో, దొంగతనంగా పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. బాధితుడైన బరిగెల సుధాకర్ తనకు చెందిన భూమిలో ఇల్లు నిర్మించుకునే ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో అక్కడకు వెళ్లిన రెండ్ల సతీష్ రెడ్డి బాధితుడిని కులం పేరుతో దూషించి, చంపుతానని బెదిరించాడని అతని మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున దళిత, సామాజిక,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బాధితుడికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఏబీఎస్ అధ్యక్షుడు కలకోటి మహేందర్, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మాదాసి సుదర్శన్, నాయకులు బరిగెల రాజు, సింగారపు యాదగిరి, మద్దెబోయిన వెంకటయ్య, అన్నందాసు దుర్గయ్య, ఓరుగంటి యాదగిరి, గర్దాస్ సునీల్ పాల్గొన్నారు.

# ఆత్మహత్య చేసుకున్న శ్రీవాణి కుటుంబానికి దొమ్మటి పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** మాజీ టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, ఇతర కాంగ్రెస్ నాయకులతో కలిసి, మల్లక్కపేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న పరకాల, రాజుపేటకు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఏకు శ్రీవాణి కుటుంబాన్ని నిన్న పరామర్శించారు. వారు శ్రీవాణి ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. పోస్ట్‌మార్టం ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్ఎంఓతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు శ్రీవాణి కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం, వారు రేగొండ మండల మాజీ ఎంపీపీ మండల తిరుపతి తల్లి ఆగమ్మ అకాల మరణం చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే, పరకాలలో దేవుడి జంపయ్య భార్య కాసాగోని లక్ష్మి అకాల మరణం చెందడంతో, దొమ్మటి సాంబయ్య వారి కుటుంబాన్ని కూడా పరామర్శించారు. ఈ పరామర్శల్లో దొమ్మటి సాంబయ్యతో పాటు కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొచ్చు చందర్, మాజీ కౌన్సిలర్లు మడికొండ సంపత్, పసుల రమేష్, మార్క రఘుపతి, నల్లెల అనిల్, మాజీ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు డా.మడికొండ శ్రీను, బొచ్చు రవి, బొచ్చు జితేందర్, చిన్నాల గోనాద్, బొచ్చు భాస్కర్, నియోజకవర్గ మండల అధ్యక్షులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# శ్రీవాణి బలవన్మరణం కలిచివేసింది

**పేద పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం**

**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని మలక్కపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఏకు శ్రీవాణి హాస్టల్ గదిలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడటం తీవ్రంగా కలిచివేసిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శ్రీవాణి ఆత్మహత్య ప్రభుత్వ హత్యే అని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో గురుకుల పాఠశాలల్లో ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగాయని ధర్మారెడ్డి గుర్తుచేశారు. ఈ ఘటన తెలిసిన వెంటనే తాను అందుబాటులో లేకున్నా, సంబంధిత అధికారులకు ఫోన్ చేస్తే స్పందించలేదని ఆయన విమర్శించారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత అధికారులదేనని ఆయన అన్నారు. తెలిసి తెలియని వయసులో పిల్లలు తప్పు చేస్తే కౌన్సిలింగ్ చేసి సరిదిద్దాల్సిన బాధ్యత గురుకుల యాజమాన్యానిదేనని, కానీ ఈ గురుకుల పాఠశాలలో విద్యార్థినులను యాజమాన్యమే బెదిరింపులకు పాల్పడుతోందని తెలిసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భయంతోనే చిన్నారులు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని ధర్మారెడ్డి అన్నారు. పేద పిల్లల ప్రాణాలతో ఈ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో మిగతా పిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. శ్రీవాణి కుటుంబానికి అండగా ఉంటామని, ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి, కారణమైన వారిని శిక్షించే వరకు ప్రభుత్వంపై న్యాయ పోరాటం చేస్తామని చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు.

# బీరన్న స్వామి జాతరకు పటిష్ట బందోబస్తు

- వరంగల్ ఏసీపీ శుభం ప్రకాష్



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** తొలి ఏకాదశి పండుగ సందర్భంగా కరీమాబాద్‌లోని శ్రీ బీరన్న స్వామి బోనాల జాతరకు పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయిస్తామని వరంగల్ ఏసీపీ నాగరాలే శుభం ప్రకాష్ హామీ ఇచ్చారు. ఇటీవల వరంగల్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన శుభం ప్రకాష్‌ను 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాతరకు బందోబస్తు కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. జూలై 6న కురుమల ఆరాధ్యదైవమైన శ్రీ బీరన్న స్వామి దేవునికి వందలాది మంది మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకొని పురవీధుల గుండా ఊరేగింపుగా బయలుదేరి దేవాలయానికి చేరుకొని స్వామి వారికి నైవేద్యం సమర్పిస్తారని కార్పొరేటర్ రవి ఏసీపీకి వివరించారు. కరీమాబాద్ బొడ్రాయి వద్ద మేక పిల్లను గావుపడతారని, కరీమాబాద్ చెట్లొల్ల గడ్డ వద్ద డోలు విన్యాసాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులతో పాటు వేలాది మంది భక్తులు హాజరవుతారని, దేవాలయంలో స్వామి వారిని దర్శించడానికి అన్ని కులాల భక్తులు వస్తారని పేర్కొన్నారు. శాంతి భద్రతలు కాపాడి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ మరుపల్ల రవి ఏసీపీని కోరారు. దీనిపై స్పందించిన ఏసీపీ నాగరాలే శుభం ప్రకాష్, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీలు చొరవ చూపాలని సూచించారు. తమ పోలీస్ శాఖ ద్వారా పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



**వరంగల్ వాయిస్, జనగామ:** జనగామ మిలీనియం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంజీవిని ఆసుపత్రిలో క్లబ్ అధ్యక్షుడు బండ భిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో భాగంగా డాక్టర్ గౌతమ్ రెడ్డి (బీఎండీ) 100 మందికి ఉచితంగా బోన్ మినరల్ డెన్సిటీ (బీఎండీ) పరీక్షలు నిర్వహించారు. అలాగే, ఉచిత మధుమేహ వ్యాధి శిక్షణ శిబిరాన్ని కూడా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి క్లబ్ పూర్వ రీజియన్ చైర్మన్ శ్రీరామ్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం నడక తప్పనిసరి అని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటానికి నిరంతరం ప్రయత్నించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కాముని వెంకటప్రసాద్, కోశాధికారి దాసరి సుమన్, పూర్వ రీజియన్ చైర్మన్ శ్రీరామ్ శ్రీనివాస్, క్లబ్ పూర్వ అధ్యక్షులు గాదే నర్సింహులు, యాట వెంకటేశ్వర్లు, కామిని శ్రీనివాస్ బాబు, ఎలికట్టె నరేందర్, క్లబ్ సభ్యులు మేడ పూర్ణచందర్, బత్తిని శ్రీశైలం, వేణుగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు ప్రత్యక్ష దేవుళ్లు




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం కాశిబుగ్గకు చెందిన జై సీతారాం పరపతి సంఘం ఆధ్వర్యంలో వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కూరపాటి మధుకు, చర్మ వైద్య నిపుణులు కూరపాటి స్వాతి దంత వైద్య నిపుణులు కూరపాటి మౌక్తికను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యోగా సేవా సంస్థ అధ్యక్షుడు కూరపాటి సుదర్శన్, జై సీతారాం పరపతి సంఘం అధ్యక్షుడు వంగరి రవి, భద్రకాళి దేవస్థానం మాజీ ధర్మకర్త సాంబారి మల్లేశం, ఆరే రమేష్, చిలుపూర్ మల్లేశం, లకుం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య వర్ధంతిని జయప్రదం చేయండి

**తాటిపాముల వెంకట్రాములు పిలుపు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిజాం నిరంకుశ రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతిని జూలై 4న ఘనంగా నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చారు. వెట్టి చాకిరికి, దొరల దౌర్జన్యాలకు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా, భూమి కోసం, భుక్తి కోసం, సామాజిక న్యాయం కోసం, కష్టానికి తగిన ప్రతిఫలం కోసం జరిగిన పోరాటంలో ముందుండి తుపాకీ తూటాలకు బలైన కొమురయ్య చిరస్మరణీయుడని వెంకట్రాములు అన్నారు. ఆయన అందించిన స్ఫూర్తితో పోరాటం ఉధృతంగా జరిగి విజయవంతమై, రాచరిక పాలన అంతమై హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైందని గుర్తు చేశారు. ఈ పరిస్థితులలో, బలహీన వర్గాల ప్రజలందరూ దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తితో సమాజంలోని దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం పోరాడేందుకు శపథం పూనేందుకు కొమురయ్య వర్ధంతి కార్యక్రమాలను ఊరూరా నిర్వహించాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికతో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లలో భయం పట్టుకుంది

## పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.రంజిత్ కుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలో భయం మొదలైందని బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ కుమార్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని విమర్శించే ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ గత పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి గురించి ఆలోచించాలని ఆయన హితవు పలికారు. "మీ కాంగ్రెస్ పార్టీలో బలమైన వ్యక్తులు లేకే కదా టీడీపీ నుంచి వచ్చిన రేవంత్ రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిని చేసింది. ఇది మీకు తెలియదా?" అని రంజిత్ కుమార్ ప్రశ్నించారు. గతంలో ముగ్గురు బీసీలను రాష్ట్ర అధ్యక్షులను చేసిన పార్టీ బీజేపీ అని, బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించిన పార్టీ కూడా బీజేపీ అని ఆయన గుర్తు చేశారు. ఈ విషయాలను టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు గుర్తుపెట్టుకుని మాట్లాడాలని డిమాండ్ చేశారు. నూతన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నాయకత్వంలో అందరూ కలిసికట్టుగా ముందుకు వెళ్తారని రంజిత్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

# జాతీయ సెమినార్ బ్రోచర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, సుబేదారి :** యూనివర్సిటీ ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాల సోషల్ సైన్సు ఆర్ట్స్ విభాగాల అధ్యాపకులు పింగిలి కాలేజీలో జరిగే రెండు రోజుల జాతీయ సెమినార్ బ్రోచర్ ను ఆవిష్కరించారు. డిజిటల్ ఎకానమీ ద ఇంపాక్ట్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆన్ గ్లోబల్ మార్కెట్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ పింగిలి కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీలలో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు సెమినార్ కన్వీనర్ డాక్టర్ పి.పద్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల అర్థశాస్త్ర విభాగపు అధ్యాపకులు డాక్టర్ శ్రీధర్ కుమార్ లోద్, డాక్టర్ తిరునహరి శేషు, డాక్టర్ ఎర్ర బొజ్జు రమేష్, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సంజీవ్, డాక్టర్ దాస్, డాక్టర్ హరి కుమార్, డాక్టర్ బండి శ్రీనివాస్, డాక్టర్ రాగమయి, డాక్టర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

# రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని ఊరుగొండ గ్రామంలో ఈరోజు రజక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో గొల్లపల్లి వినోద్ అధ్యక్షుడిగా, చింతల రమేష్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ తమ సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికైన అభ్యర్థులను సంఘ సభ్యులు అభినందించారు.

# మొరం తవ్వకాలపై మైనింగ్ ఇన్‌స్పెక్టర్ పరిశీలన

## వరంగల్ వాయిస్ కథనానికి స్పందన



**వరంగల్ వాయిస్, దామెర:** దామెర మండలంలోని పసరగొండ శివారు గుట్టల్లో జరుగుతున్న మొరం తవ్వకం పనులను మైనింగ్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత యజమాని తదితరులు పాల్గొన్నారు.

# రమాదేవి సేవలు మరువలేనివి

## ● ఘనంగా వీడ్కోలు పలికిన భీంపల్లి పాఠశాల



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** మండలంలోని భీంపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ భీంపల్లి పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా సుదీర్ఘ సేవలందించిన రమాదేవికి ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీహెచ్ఎస్ భీంపల్లి ప్రధానోపాధ్యాయులు రవి మాట్లాడుతూ రమాదేవి టీచర్ క్రమశిక్షణ, కార్యదక్షత అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆమె బోధనా వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసి ఎంతో మంది విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారని పేర్కొన్నారు. అలాగే, ఎంపీపీ ఎస్ భీంపల్లి ప్రధానోపాధ్యాయులు తాటికొండ వీరస్వామి మాట్లాడుతూ రమాదేవి విద్యార్థుల పట్ల ఎంతో ప్రేమను కనబరిచేవారని గుర్తు చేసుకున్నారు. పదవీ విరమణ అనంతరం ఆమె తమ కుటుంబ సభ్యులతో ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులచే ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ వీడ్కోలు సభలో జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సుమ, శైలజ, గోపాల్ రెడ్డి, జనార్దన్, గీతతో పాటు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, జ్యోత్స్న, సుజాత, ప్రీ ప్రైమరీ టీచర్లు పూజిత, రాధిక, కవిత పాల్గొన్నారు. రమాదేవి గారి కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, పాఠశాల పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో

## ● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్:** బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఖిలా వరంగల్ మండల సీపీఐ మహాసభ వరంగల్ కోటలో ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ పాలనలో ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతూ ప్రజల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని ఆయన దుయ్యబట్టారు. రచయితలను, కవులను, కళాకారులను, విద్యావేత్తలను అణిచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్నారని, కేంద్రంలో జాతీయవాదం పేరుతో హిందుత్వ ఎజెండాతో ముస్లిం, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులపై విషం కక్కుతూ ప్రశ్నించే గొంతుకను నొక్కుతున్నారని ఆయన అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం ఆదివాసీలను హత్య చేస్తోందని, అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడానికే ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.కె.బాష్ మియా, పనాస ప్రసాద్, మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, జిల్లా నాయకులు గన్నారపు రమేష్, బుస్సా రవి, తోట చంద్రకళ, సంగి యెలెందర్, ల్యాదెళ్ల శరత్, దామెర క్రిష్ణ పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు

## ◆ వైద్య సేవలను కొనియాడిన రెడ్ క్రాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ భవన్‌లో రెడ్ క్రాస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ డీఎం అండ్ హెచ్‌ఓ ఎ. అప్పయ్య హాజరయ్యారు. ముందుగా డీఎంహెచ్‌ఓ, రెడ్ క్రాస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు "డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్" చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హనుమకొండ డీఎంహెచ్‌ఓ ఎ.అప్పయ్య మాట్లాడుతూ, విధి నిర్వహణలో డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ ను ఆదర్శంగా తీసుకుని ప్రతి వైద్యుడు జాతి నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా హనుమకొండ డీఎం అండ్ హెచ్‌ఓ ఎం. అప్పయ్య, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు డాక్టర్ కె. సుధాకర్ రెడ్డి, డాక్టర్ యం. శేషుమాదవ్, రెడ్ క్రాస్ వైద్యులు డా. టి. మదన్ మోహన్ రావు, డా. మొహమ్మద్ తహర్ మసూద్, లయన్స్ క్లబ్ కంటి దవాఖాన డాక్టర్ డా. భరద్వాజ్, డా. కంటెం లక్ష్మీనారాయణలను పాలకవర్గ సభ్యులు శాలువా, పుష్పగుచ్ఛం, మెమెంటోతో ఘనంగా సన్మానించారు.

# విపత్తుల సమయంలో సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలి

## ● ములుగు కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు:** విపత్తుల నేపథ్యంలో ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని, గోదావరి నది, జంపన్న వాగు పరిసర ప్రాంతాల ప్రజలకు ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. జాతీయ విపత్తు ప్రతిస్పందన బృందం (ఎన్డీఆర్ఎఫ్)ను కోరారు. మంగళవారం జాతీయ విపత్తు ప్రతిస్పందన బృందం (ఎన్డీఆర్ఎఫ్) జిల్లాకు విచ్చేసిన సందర్భంగా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సీహెచ్ మహేందర్ జితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని రామప్ప, లక్నవరం సరస్సులు, గోదావరి నది, జంపన్నవాగు నీటి ప్రవాహం, గతంలో జరిగిన సంఘటనల గురించి ఎన్డీఆర్ఎఫ్ బృందానికి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, 10వ బెటాలియన్, విజయవాడ కమాండెంట్ ప్రసన్న కుమార్ ఆదేశాల ప్రకారం ఆర్ఆర్సీ హైదరాబాద్ నుంచి ఇన్‌స్పెక్టర్ ముకేష్ కుమార్ (కమాండర్), ఏఎస్ఐ సుధీర్, హెడ్ కానిస్టేబుల్ జగదీష్తో కూడిన 28 మంది సభ్యుల బృందం జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల వర్షాకాలం ముగిసే వరకు జిల్లాలో ఉంటుందని తెలిపారు. గోదావరి నది, జంపన్న వాగు పరిసర ప్రాంతాలైన ఊరటం, నార్లాపూర్, మేడారంలలోని నీటి ప్రవాహ ప్రాంతాలను పరిశీలించి, అకాల వర్షాలు, విపత్తుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని కోరారు. ఎన్డీఆర్ఎఫ్ బృందానికి కావలసిన అన్ని ఏర్పాట్లను సమకూర్చాల్సిందిగా జిల్లా పంచాయతీ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవ రాజ్, కలెక్టరేట్ డి-సెక్షన్ పర్యవేక్షకులు శివకుమార్, ఎన్డీఆర్ఎఫ్ బృందం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పక్కాగా పారిశుద్ధ్య నిర్వహణ

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ:** జిల్లాలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సమర్థవంతంగా జరుగుతుందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యక్రమం కింద తమిళనాడు నుంచి వచ్చిన సర్పంచులు, బ్లాక్ ప్రెసిడెంట్లు, అధికారులు మంగళవారం జిల్లాలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. వారిని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) స్వరూప లింగాల ఘనపురం మండలం నెల్లుట్ల గ్రామానికి తీసుకెళ్లి, తడి-పొడి చెత్త నిర్వహణ, పారిశుద్ధ్యం, నర్సరీలలో మొక్కల పెంపకం వంటి జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం, జడ్పీ కార్యాలయానికి వచ్చిన తమిళనాడు బృందంతో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ, తడి-పొడి చెత్త నిర్వహణ ద్వారా వస్తున్న ఆదాయం, నర్సరీలలో మొక్కల పెంపకం విధానం, భూగర్భ జలాలను పెంచేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం, తద్వారా పెరిగిన ఆయకట్టు, పంటల సాగు, పక్కాగా శానిటేషన్ నిర్వహణ వల్ల సీజనల్ వ్యాధులను అరికడుతున్న తీరును సర్పంచుల బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ మాధురి షా, డీపీవో స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్లకు సన్మానం




**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్స్ డే సందర్భంగా ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ మంజుల, డాక్టర్ మహేంద్ర, డాక్టర్ రాధా శాంతి ప్రియ, డాక్టర్ జాస్మిన్ మెహర లను ఆసుపత్రి సిబ్బంది పుష్ప కుచ్చాలను అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీకాంత్, భాగ్య, హెచ్ఈఓ అశోక్ బాబు, సీనియర్ అసిస్టెంట్ రవీందర్, ఏఎన్ఎంలు ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) హనుమకొండ జిల్లా కార్యవర్గం డిమాండ్ చేసింది. మంగళవారం డీఈఓ ఆఫీస్‌లో సూపరింటెండెంట్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంశీకృష్ణ మరియు రంజిత్ కుమార్ మాట్లాడుతూ, పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం వహించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శంకర్, రేవంత్, మోక్షిత్, జ్ఞానేశ్వర్, అన్వేష్ పాల్గొన్నారు.

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

## ఎంపీడీవో విమల పిలుపు



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 3న (గురువారం) నిరుద్యోగుల కోసం శిక్షణ, ఉపాధి మేళా నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జి. విమల తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ యువకులకు దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకంలో భాగంగా కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, లాజిస్టిక్ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇవ్వబడుతుందని ఆమె పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ కార్పొరేట్ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాంలు, స్కాలర్‌షిప్, కేంద్ర ప్రభుత్వం నుండి స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్, రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ మార్కెటింగ్ మిషన్ సర్టిఫికెట్ ఇవ్వబడతాయని వివరించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డ్, ఆధార్ కార్డులను తీసుకొని ఎంపీడీవో కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. మండలంలోని నిరుద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# నిషేధిత దగ్గు మందుల విక్రయం

## మెడికల్ షాపులో పోలీసుల తనిఖీలు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీమ్‌కు అందిన సమాచారం మేరకు, పోలీసులు స్థానిక డ్రగ్ అధికారి కిరణ్‌తో కలిసి రంగశాయిపేటలోని ఆయుష్ మందుల షాపులో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మత్తు కలిగించే ప్రభుత్వ నిషేధిత దగ్గు మందులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెద్ద ఎత్తున ఈ నిషేధిత మందులను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ శివ కేశవులు, ఆర్ఎస్ఐ మనోజ్, పూర్ణ, నాగరాజుతో పాటు యాంటీ డ్రగ్స్ కంట్రోల్ వింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



**వరంగల్ వాయిస్, పరకాల:** ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున మొక్కలు నాటడానికి అనువైన సమయం అని, పరకాల మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని నర్సరీలలో పెంచిన మొక్కలను ప్రతి ఇంటికి 6 మొక్కల చొప్పున పంపిణీ చేసి, అవి బతికేలా చూడాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. లక్ష్మీపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో "నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద" కార్యక్రమంలో భాగంగా ఒక చిన్నారితో మొక్క నాటించి, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించి, రెండు రోజుల్లో మొక్కల పంపిణీ పూర్తి చేసి వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని, అలాగే మిగతా ప్లాంటేషన్ పనులను కూడా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రిజ్వానా, అంగన్‌వాడీ టీచర్ స్రవంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సారంగపాణి, ఉపాధ్యాయురాలు బాసాని లత, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడికి విజయచందర్ రెడ్డి శుభాకాంక్షలు



**వరంగల్ వాయిస్, పరకాల:** తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఎన్. రామచందర్ రావును బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.పెసరు విజయచందర్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డా. విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ, "రాష్ట్ర పార్టీకి అనుభవజ్ఞుడైన, నిబద్ధత కలిగిన నాయకుడు లభించడం గర్వకారణం" అని అన్నారు. అలాగే, పార్టీ శ్రేణులందరూ సమష్టిగా పనిచేసి, ఆయన నాయకత్వంలో బీజేపీని అన్ని ప్రాంతాల్లో విస్తరించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దామెర మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, వీసం రమణారెడ్డి, మొలుగూరి శ్రీనివాస్, నిమ్మగడ్డ జాన్ విక్రమ్, బత్తుల సుమంత్, కాగితాల సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పాశమైలారం ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారంలో సోమవారం జరిగిన ఘోర దుర్ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) మంగళవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు డీఆర్‌ఓను కలిసి వినతి పత్రం అందజేశారు. సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ఈ ప్రమాదంలో ఇప్పటికీ 40 మందికి పైగా మరణించారని, అనేకమందికి తీవ్ర గాయాలయ్యాయని, మరికొంత మంది ఆచూకీ తెలియడం లేదని ఐఎఫ్‌టీయూ నాయకులు తెలిపారు. రసాయనిక ఫ్యాక్టరీలలో తగిన జాగ్రత్తలు, భద్రతా సౌకర్యాలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు ఫ్యాక్టరీలపై కార్మిక శాఖ అధికారులు, ప్రభుత్వ ఇన్‌స్పెక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఈ దారుణాలు జరుగుతున్నాయని వారు మండిపడ్డారు. డీఆర్‌ఓ విశ్వ ప్రసాద్‌ను కలిసిన వారిలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, నగర కార్యదర్శి ఎర్ర జయబాబు, అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి రాచర్ల బాలరాజు, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, మన్నె కరుణాకర్, కర్రు ఐలయ్య తదితరులు ఉన్నారు.

# 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి




**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం:** జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా జులై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశాలు, అంగన్వాడీలు, గ్రామ పంచాయతీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, స్కావెంజర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ పిలుపునిచ్చారు. కన్నాయిగూడెం మండల కేంద్రంలో కావిరి సుధాకర్ అధ్యక్షతన జరిగిన సీఐటీయూ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రత్నం రాజేందర్ మాట్లాడుతూ, 100 సంవత్సరాల క్రితం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం కరోనా సమయంలో ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు గుట్టుచప్పుడు కాకుండా రద్దు చేసిందని అన్నారు. వాటి స్థానంలో కార్మిక వ్యతిరేక, పెట్టుబడిదారీ యాజమాన్యాలకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి అమలు చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోందని, వాటిని కార్మిక వర్గం తిప్పికొడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం.డి.దావూద్, జిల్లా నాయకులు కొప్పుల రఘుపతి, స్కావెంజర్స్ యూనియన్ నాయకులు ప్రవీణ్, పార్వతి, పాప, రజిత, కమునిస, తులసి, జ్యోతి, నాగమణి, వెంకటేష్, పోషయ్య, తులసి, వెంకటేశ్వరి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ పొలం బాట



**వరంగల్ వాయిస్, గణపురం:** మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో "పొలం బాట" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతుల సమక్షంలో విద్యుత్ శాఖాధికారులు పలు అంశాలను వివరించారు. ఎస్.ఈ. మల్చూర్ మాట్లాడుతూ, రైతుల పొలాల్లోని వంగిన స్తంభాలను సరిచేయడం, విరిగిన లేదా ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను మార్చడం, కిందకు వేలాడుతున్న లూజు లైన్లను సరిచేయడం వంటి పనులను చేపడతామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతు సోదరులు బట్టలు ఆరేసుకునే దండానికి జీఐ వైరును వాడకూడదని, అలా వాడటం వల్ల విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే, సర్వీస్ వైర్‌లో జాయింట్స్ లేకుండా చూసుకోవాలని, జాయింట్స్ ఉండటం వల్ల కూడా షాక్‌కు గురయ్యే అవకాశం ఉందని సూచించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన అధికారులు, భద్రతా సూత్రాలను పాటించాలని, విద్యుత్ పొదుపు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ మల్చుర్, డీఈ టెక్నికల్ (భూపాలపల్లి) వెంకటేశం, స్థానిక ఏఈ వెంకట రమణ, సబ్ ఇంజినీర్ రజినీకాంత్, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రంయ్యాల శ్రీధరాచార్యులకు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్:** నగరంలోని పోచమ్మ మైదానం సమీపాన గల ఎల్.బీ. నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాసూమ్ అలీలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న రంయ్యాల శ్రీధరాచార్యులను హనుమకొండలోని కుమారపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సన్మానించారు. తమ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఇనపునూరి దేవమణి, జహీద నసీమ్, గంగారపు భాస్కర్ రావుల ఉద్యోగ విరమణ అభినందన సభలో భాగంగా కార్యక్రమానికి వ్యాఖ్యాతగా, గాయకుడిగా వ్యవహరించిన శ్రీధరాచార్యులను పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు కె. మేజేస్, ఉపాధ్యాయులు టి.భాస్కర్, పద్మావతి, సుప్రజ, మల్లారెడ్డి, జితేందర్, వెంకట లక్ష్మి, ఖురేషి, హాజీరా, మెహర్ కలిసి సన్మానించారు.

## డాక్టర్లు సమాజంలో అసలైన యోధులు




**వరంగల్ వాయిస్, వరంగల్:** యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్ – నార్త్ ఈస్టర్న్ రీజియన్, తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా వరంగల్ నగరంలోని శంభునిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ స్పీకర్ డాక్టర్ బండ ప్రకాష్ మాట్లాడుతూ భారతదేశ ప్రఖ్యాత వైద్యుడు, పూర్వ ముఖ్యమంత్రి డాక్టర్ బి. చంద్ర రాయ్ జయంతి, వర్ధంతిని జాతీయ డాక్టర్స్ డేగా జరుపుకుంటున్న సందర్భాన్ని గుర్తు చేశారు. "డాక్టర్లు మన సమాజంలో అసలైన యోధులన్నారు. ఈ సందర్భంగా ప్రసిద్ధ హృదయ వైద్య నిపుణులు డాక్టర్ రామాక శ్రీనివాస్, మాజీ ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వీ. చంద్రశేఖర్, డాక్టర్ సంబమూర్తి, డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, మరియు డాక్టర్ కొంతం కృష్ణలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారదా బాయి, యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్ తెలంగాణ రాష్ట్ర శాఖ కోఆర్డినేటర్ ధర్మపురి రాజగోవిందు, జాతీయ యువజన పురస్కార గ్రహీత మండల పరశురాములు, స్థానిక నాయకులు రావుల బాలరాజు, వద్నాల నరేందర్, డా.అభిలాష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డోర్నకల్‌లో బేషుగ్గా 'బడిబాట'

● కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ప్రశంస



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం ఆయన కురవి, డోర్నకల్, సీరోల్ మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో ఆయన సానిటేషన్, న్యూట్రిషన్, ఎడ్యుకేషన్, హెల్త్ అంశాలపై ప్రత్యేక అధికారులతో క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేయించారు. కురవి మండలం బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టిక, మందుల స్టాక్ వివరాలు, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుతం వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆరోగ్య కేంద్రాలలో సరిపడా మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, షెడ్యూలు ప్రకారం వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. డోర్నకల్ మండలంలోని వెన్నారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో నమోదు గణనీయంగా పెరగడంలో గ్రామస్తుల భాగస్వామ్యాన్ని గమనించి, వారిని అభినందించారు. మన్నెగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, పాఠశాలలో మ్యాథమెటిక్స్ ఇతర సబ్జెక్టులను విద్యార్థులు ఏ విధంగా నేర్చుకుంటున్నారో పరిశీలించారు. ఈ రెండు పాఠశాలల్లోని భౌతిక వనరులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి తగిన సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి అంద్రు రవీందర్ రెడ్డి, ఎంఆర్ఓ ఇమ్మానియల్, ఎంపీడీఓ శ్రీనివాస్ నాయక్, ఆర్ఐ యాసిన్, డీఎస్ఓ అప్పారావు, ఎంఈఓ లక్ష్మ, లచ్చిరాం తదితరులు ఉన్నారు.

## ఏడీఏకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, పరకాల :** ఏడీఏ పరిధి ఎరువులు, పురుగుమందులు, విత్తనాల డీలర్ వెల్ఫేర్ అసోసి యేషన్స్ ఆధ్వర్యంలో పరకాల ఏడీఏ పదవీ విరమణ కార్యక్రమాన్ని పరకాలలోని స్వర్ణ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గందె వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్, వరంగల్ జిల్లా ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు, వరంగల్ జేడీఏ అనురాధ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉద్యోగ విరమణ పొందిన పరకాల ఏడీఏ వంగ రవీందర్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి వరంగల్, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాల వ్యవసాయ అధికారులు, పరకాల మండల పరిధిలోని పరకాల, ఆత్మకూరు, నడికూడ, దామెర, శాయంపేట మండలాల వ్యాపారస్తులు హాజరై ఏడీఏ రవీందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అన్ని మండలాల అధ్యక్షులు గందె వెంకటేశ్వర్లు, అశోక్, రమేష్, రవితేజ, మల్లికార్జున్‌లకు అధికారులకు, వ్యాపారస్తులకు ఏడీఏ రవీందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## కురుమలు ఐక్యతతో కులాభివృద్ధికి పాటుపడాలి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** కురుమ కులస్తులందరూ ఐక్యంగా ఉండి కులాభివృద్ధికి కృషి చేయాలని ఉర్సు కురుమకుల పెద్ద, రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షులు మరుపల్ల రవి పిలుపునిచ్చారు. గతంలో కురుమలు నిరక్షరాస్యతతో వెనుకబడి ఉన్నారని, నేడు అక్షరాస్యతలో ముందున్నారని ఆయన అన్నారు. కురుమ కులస్తులందరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించినట్లయితే సమాజంలో గుర్తింపు పొందుతారని, దీనివల్ల ఆర్థికంగా నిలదొక్కుకొని అన్ని రంగాలలో రాణిస్తారని రవి పేర్కొన్నారు. కురుమల హక్కులను కాపాడుకోవడానికి కార్యవర్గం ముందుండాలని అన్నారు. ఈ నెల 6వ తేదీన కురుమల ఇలవేల్పైన శ్రీ బీరన్న స్వామి బోనాల జాతర అంగరంగ వైభవంగా జరగడానికి కార్యవర్గం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉర్సు కురుమ సేవా సంఘం 2025 నుంచి 2027 వరకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సమావేశంలో కురుమ సంఘం నాయకులు మిర్యాల కుమారస్వామి, మండల ప్రమీల, కెంచ చేరాలు, చీర భరత్‌లు మాట్లాడారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడు ఏరా కోటేశ్వర్ రావు, ఉపాధ్యక్షులుగా మంగ రమేష్, అన్న శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గౌడ శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా కొలుపుల కుమార స్వామి, నీల యాకయ్య, కోశాధికారిగా మరుపల్ల ఈశ్వర్ ప్రసాద్, సహాయ కోశాధికారిగా కోరె సాంబమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కుండే సదానందం, ఆర్గనైజర్ గా బాల్గు అశోక్, కార్యవర్గ సభ్యులుగా కుండె రాజు, చీర భరత్, మరుపల్ల శివ, అన్న నాగేశ్వరరావు, ఆరే రవి, అన్న రమేష్, ముఖ్య సలహాదారులుగా కెంచ చేరాలుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని కుల పెద్ద మరుపల్ల రవి ప్రమాణస్వీకారం చేయించి అభినందించారు.

## సమాజ సేవకై పోటీపడండి

◆ లయన్స్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య పిలుపు





**వరంగల్ వాయిస్, హనుమకొండ:** సమాజంలోని అవసరార్థులను ఆదుకునేందుకే "వీ సర్వ్!" నినాదంతో అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ ఇతర స్వచ్ఛంద సంస్థలకు మార్గదర్శకంగా నిలుస్తుందని 320ఎఫ్ జిల్లా నూతన గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య అన్నారు. లయన్స్ సేవా ప్రపంచానికి యువతరం ఆసక్తిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. హనుమకొండ శాయంపేటలోని లయన్స్ భవన్‌లో సోమవారం రాత్రి థౌజండ్ పిల్లర్స్ క్లబ్ 27వ ఇన్‌స్టాలేషన్ వేడుకలు కనులపండువగా జరిగాయి. క్లబ్ అధ్యక్షుడు చొప్పరి సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రస్తుత 2025-2026 లయనిస్టిక్ సంవత్సరానికి క్లబ్ అధ్యక్షుడిగా లయన్ పరికిపండ్ల వేణు, ప్రధాన కార్యదర్శిగా వైద్యం రాజగోపాల్, కోశాధికారిగా సామల అన్వేష్ తో పాటు ఇతర కార్యవర్గంచే మల్టిపుల్ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

క్లబ్‌లో నూతనంగా చేరిన సభ్యులతో పీడీజీ డాక్టర్ కే. సుధాకర్ రెడ్డి ప్రమాణం చేయించారు. ఇన్‌స్టాలేషన్ చైర్మన్‌గా వై.వి. వామన రావు, కోచైర్మన్‌లుగా తాళ్లపల్లి సురేష్, సంజీవయ్య వ్యవహరించి నిర్వహించిన ఈ కార్యక్రమంలో థౌజండ్ పిల్లర్స్ క్లబ్ నుండి వీడీజీ వన్‌గా ఎన్నికైన నరహరి సుధాకర్ రెడ్డి, అనిత దంపతులను ఘనంగా సత్కరించారు. ఎస్‌విడిజి పుట్ట హరి కిషన్ రెడ్డిలు, పీడీజీలు ముచ్చ రాజిరెడ్డి, పొట్లపల్లి శ్రీనివాసరావు, కన్నా పరశురాములు, డీసీఎస్ హబీబ్, సి.హెచ్. రఘునాథరెడ్డి, జె. రాజిరెడ్డి, పొన్నాల సంయుక్త, ఉష మార్త, కటంగూరి రాంగోపాల్ రెడ్డి లతో పాటు ప్రొఫెసర్ దయాకర్ రావు, పాము శ్రీనివాస్, అంజిరెడ్డి, గుజ్జారి రమేష్, దడిగల రమేష్, చంద్రశేఖర్, డాక్టర్ శివుడు, రణధీర్ రెడ్డి, చిర్రా ఉపేందర్, వెంకటేశ్వర్లు, రవికుమార్, మార్క వేణుగోపాల్ తదితర అనేక మంది లయన్ నాయకులు పాల్గొన్నారు. పెండం వేణుమాధవ్, తిరునగరి నరేందర్ లు మాస్టర్ ఆఫ్ సెర్మనీగా వ్యవహరించారు.




# ఇండియన్ సినిమాను ఉన్నతంగా నిలిపే యత్నం



### ప్రత్యేకంగా సిద్ధం అవుతున్న వార్-2

ఇండియన్ సినిమాను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు యష్ రాజ్ ఫిలిమ్స్, బాలీవుడ్ డైరెక్టర్ అయాన్ ముఖర్జీ సిద్ధమవుతున్నారు. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ , గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ల కలయికలో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవెయిటెడ్ పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వార్ 2' ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పరచుకుంది. ఇప్పుడు తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. వార్ 2లో యాక్షన్ ఒక్కటే కాదు? ఎనర్జీ పరంగా దుమ్ములేపే డాన్స్ నెంబరు కూడా ఉండబోతోంది. ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో అత్యుత్తమ డ్యాన్సర్లు అని పేరొందిన ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ఇద్దరు కలిసి ఒకే స్క్రీన్‌పై స్టెప్పులేస్తే, అది రొటీన్ సాంగ్ మాదిరిగా కాకుండా డైనమిక్ మ్యూజికల్ ట్రీట్‌గా ఉంటుందని అంటున్నారు. ఇటీవల యష్ రాజ్ స్టూడియోస్‌లో ఈ సాంగ్ కోసం ఇద్దరు హీరోలు రిహార్సల్స్ చేయగా,ఈ రోజు నుంచే షూటింగ్ ప్రారంభమైంది. ఈ డాన్స్ నంబర్‌కి టాప్ కొరియోగ్రాఫర్ నేతృత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. షూటింగ్ పలు రోజులు కొనసాగనుండగా, ఇందులో హైవోల్టేజ్ ఎనర్జీ, ఇంటెన్స్ స్టెప్స్ ఉండనున్నాయన్న టాక్ ఫిలింనగరంలో హీట్ పెంచుతోంది. వార్ 2ను కేవలం యాక్షన్ థ్రిల్లర్‌గా కాకుండా, అన్ని విభాగాల్లోనూ స్టాండర్డ్స్‌ని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్టీఆర్ ? హృతిక్ మధ్య ఫైట్స్ అన్నీ ఏకంగా హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కుతుండగా, ఇప్పుడు డ్యాన్స్ ఎలిమెంట్ ఈ సినిమాను మరో లెవెల్‌కి తీసుకెళ్లనుంది. ఇద్దరికి సింగిల్ టేక్ డ్యాన్సర్లు అనే పేరుంది. ఎన్టీఆర్ తన బ్లాస్టింగ్ డ్యాన్స్ మూవ్‌లతో తెలుగులో తిరుగులేని డ్యాన్సర్‌గా గుర్తింపు పొందగా, హృతిక్ రోషన్ బాలీవుడ్‌లో తన స్టైలిష్ స్టెప్స్‌తో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. అలాంటి స్టార్లను ఒకే పాటలో చూడడం అంటే, అభిమానులకే కాదు , ప్రేక్షకులందరికీ అది జీవితాంతం మరిచిపోలేని విజువల్ ఎక్స్‌పీరియన్స్ అవుతుంది. డ్యాన్స్ సీక్వెన్స్‌తో పాటు పవర్‌ప్యాక్డ్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్న ఈ చిత్రం భారీ అంచనాలతో తెరకెక్కుతోంది. ఎన్టీఆర్ 'దేవర', హృతిక్ 'టైగర్' తర్వాత వీరిద్దరు కలిసి వార్ 2 చిత్రం చేస్తున్నారు. ఆగస్ట్‌లో విడుదల కానున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

## కొత్త ప్రయోగంతో.. రానా దగ్గుబాటి

గ్రామీణ నేపథ్యంలో కొత్తపల్లిలో ఒకప్పుడు ప్రస్తుతం వైవిధ్యమైన కథలతో ప్రయోగాలు చేస్తున్న రానా దగ్గుబాటి మరో కొత్త తరహా చిత్రానికి శ్రీకారం చుట్టారు. గ్రామీణ నేపథ్యం తో సాగే ఈ భావోద్వేగ కథ వెనక సున్నితమైన సామాజిక సందేశం కూడా ఉంది. ఈ చిత్రానికి ప్రవీణ పరుచూరి దర్శకత్వం వహిస్తున్నారు. ఇదివరకే 'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' వంటి చిన్న సినిమాలతో పెద్ద సెన్సిబుల్ హిట్స్ అందించిన ప్రవీణ, ఈసారి మరింత లోతైన కథతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కథలో గ్రామీణ యువకుడు తన జీవితంలో ఎదురైన ఓ అనూహ్య సంఘటన, తరువాత ఎదుర్కొన్న ప్రయాణాన్ని చూపించ నుంది. మారుతున్న సమాజంలో గ్రామీణ సంస్కృతి, విలువలు, సంబంధాలు ఎలా మాయమవుతున్నాయనే విషయాన్ని ఈ చిత్రం లోతుగా చూపనుంది. కాగా ఈ మూవీలో రానా, పూర్తి గ్రామీణ గెటప్‌లో కనిపించనున్నాడు. ఇప్పటి వరకు చూడని ఓ మెలోడ్రామా టిక్, ఎమోషనల్ కోణంలో రానా నటనను ఈ సినిమాలో చూడబోతున్నాం. మేకర్స్ చెబుతున్న దానివల్ల ఇది రానా కెరీర్‌లో కొత్త మలుపు కావొచ్చని అంచనాలు ఉన్నాయి. ఇప్పుడు చూడాల్సిందల్లా ఈ కొత్త ప్రయోగం రానాకు హిట్ అందిస్తుందా లేదా అన్నది.




## ట్రైలర్స్‌తో దూసుకుపోతున్న తమ్ముడు

టాలీవుడ్‌స్టార్ హీరో నితిన్ 'తమ్ముడు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. దర్శకుడు వేణు శ్రీరామ్ దర్శకత్వంలో ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా తమ్ముడు సినిమా చేశారు. ఇది జూలై 4న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ స్పీడ్ పెంచారు. ఇంటర్వ్యూలు, ప్రీ రిలీజ్ ఈవెంట్స్ ఇలా సినిమాపై ఆసక్తిని కలిగించే ప్రయత్న చేశారు. మరో రెండు రోజులలో తమ్ముడు చిత్రం విడుదల కానుండగా, చిత్ర బృందం రిలీజ్ ట్రైలర్ కొద్ది సేపటి క్రితం విడుదల చేసింది. నేను పుట్టినప్పుడే మా అమ్మ చనిపోయింది.. అనే డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది.నాకు అమ్మ అయిన నాన్న అయిన అన్నీ మా అక్కే అనే డైలాగ్ ఈ మూవీ సిస్టర్ సెంటిమెంట్‌తో రూపొందుతుంది అని తెలియజేస్తుంది. ట్రైలర్ ఎమోషన్స్, యాక్షన్ తో నిండిపోయింది. మూవీపై భారీ అంచనాలే పెంచింది. ఈ చిత్రం నితిన్‌కి తప్పక మంచి హిట్ ఇస్తుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.



## పవన్ షూటింగ్ స్పాట్‌లోకి చిరు ప్రత్యక్షం

ఉస్తాద్ భగత్ సింగ్ సెట్‌లో అడుగుపెట్టిన చిరంజీవి చిత్రీకరణను దగ్గరుండి వీక్షించారు. దీనికి సంబంధించిన ఓ ఫొటో బయటకు వచ్చింది. ఇందులో చిరు షూటింగ్ సీన్?ను చూస్తుండగా, పవన్ కల్యాణ్ పక్కనే ఉండడం మనం చూడవచ్చు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెగా బ్రదర్స్ ఇద్దరు చాలా రోజుల తర్వాత కలిసి కనిపించడంతో ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేవు. ఇక ఈ చిత్రంలో రియల్ లైఫ్ సీన్‌ని హరీష్ ఎ□`లాన్ చేసినట్టు సమాచారం. పవన్ కల్యాణ్? ఆ మధ్య ఓ సందర్భంలో కారు రూఫ్?పై కూర్చొని ప్రయాణించడం మనం చూశాం. ఆయన కారు టాప్?పై కూర్చొని వెళుతుండగా, కారుకు ఇరువైపులా సెక్యూరిటీ, వెనకాల బైకులపై అభిమానులు వెళ్లారు. ఈ వీడియో అప్పట్లో సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. ఇప్పుడు ఈ సీన్‌ని రీ క్రియేట్ చేసి సినిమాలో పెట్టనున్నాడట హరీష్ శంకర్. ఒకవేళ ఈ సీన్ సినిమాలో ఉంటే, థియేటర్లలో ఫుల్ విజిల్స్ పడడం పక్కా అని చెప్పాలి. ఇక ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ సరసన యువ నటి శ్రీలీల సందడి చేయనుంది. సాక్షి వైద్య, అశుతోష్ రానా, గౌతమి, నాగ మహేష్, టెంపర్ వంశీ, కేజీఎఫ్ ఫేమ్ అవినాష్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





# హరిణి రామ్ ప్రసాద్‌కు కన్నీటి వీడ్కోలు

- జర్నలిస్ట్ కుటుంబానికి అండగా ఉంటాం..
- ప్రెస్ క్లబ్ లో నివాళులర్పించిన యూనియన్ బాధ్యులు





**వరంగల్ వాయిస్, వరంగల్ :** గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ వీడియో జర్నలిస్ట్ హరిణి రామ్ ప్రసాద్ మృతదేహానికి కన్నీటి వీడ్కోలు పలికారు. నిన్న గుండెపోటుతో మృతి చెందిన ఆయనకు మంగళవారం ఉదయం ఎంజీఎం ఆస్పత్రిలో పోస్ట్ మార్టం నిర్వహించిన అనంతరం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కు తరలించారు. క్లబ్ లో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య తదితకెలు రామ్ ప్రసాద్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామంటూ హామీ ఇచ్చారు. రామ్ ప్రసాద్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులు అర్పించిన వారిలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపల్లి మధు, టీయూడబ్ల్యూజే (143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, సీనియర్ జర్నలిస్టులు సీహెచ్ సుధాకర్, మెండు రవీందర్, వేముల రాజేశ్వర్ రావు, పొగాకుల అశోక్, బూరం ప్రశాంత్, దొంతు నవీన్, తిరుపతి, రాజు, వేణు, కిషోర్, వీడియో జర్నలిస్టులు తిరుమల్, రామ్ చందర్, సుధీర్, రామరాజు, ప్రదీప్, వాజీద్, రాజు, వంశీ, సుధాకర్, రాజ్ కుమార్, క్లబ్ కోశాధికారి బొల్ల అమర్, ఉపాధ్యక్షుడు బొడిగె శ్రీను, ఈసీ మెంబర్లు ఎండీ నయీంపాషా, అంజనేయులు, దిలీప్ తదితరులు రెండు నిమిషాలు మౌనం పాటించి రామ్ ప్రసాద్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు.

### కొండా సాయం..

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కరీమాబాద్ కోయవాడకు చెందిన రామ్ ప్రసాద్ అకాల మీతిపై మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు రాంప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటామంటూ హామీ ఇచ్చారు. వారు పంపించిన ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, కొత్తపెల్లి శ్రీనివాస్, భాషాపాకా సదానందం రామ్ ప్రసాద్ భార్యకు అందజేశారు. వీరితోపాటు మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కొత్తూరు రాజా పాల్గొన్నారు.



## గడ్డం కేశవమూర్తికి ఘన సన్మానం

ఓరుగల్లు డిజిటల్ ప్రింట్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడిగా వరంగల్ వాయిస్ ఎడిటర్, వరంగల్ ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు, ఉత్తమ జర్నలిస్ట్ రాష్ట్ర అవార్డు గ్రహీత గడ్డం కేశవమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఘనంగా సన్మానం కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయంలో మంగళవారం ఎంఎన్ మూర్తి, వరంగల్ వాయిస్ నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్య ప్రకాశ్, డెస్క్ ఇంచార్జి గోలి రవి, స్టాఫ్ రిపోర్టర్ సిద్ధోజు రాకేష్, రిపోర్టర్లు ఉస్నగిరి శ్రీకాంత్, పూజరి విజయ్ తదితరులు బోకే అందజేసి శాలువాతో సత్కరించారు.

**- వరంగల్ వాయిస్, హనుమకొండ**



## డాక్టర్స్ డే సందర్భంగా ఘన సన్మానం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** డాక్టర్స్ డే సందర్భంగా వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ బి.సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఐ.ప్రకాష్ ను ఆర్బీఎస్కే మెడికల్ ఆఫీసర్స్ బృందం మంగళవారం ఘనంగా సన్మానించారు. వరంగల్ డీఎంహెచ్ఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ గుండా రవీందర్, ఆర్బీఎస్ కె మెడికల్ ఆఫీసర్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ మధుల, డాక్టర్ రజిత, డాక్టర్ భవిత, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ గణేష్, డాక్టర్ గోవర్ధన దేవి తదితరులు పాల్గొన్నారు.

## 9న చలో ఇందిరా పార్క్

### ఎన్‌టీఈపీ ఉద్యోగుల పిలుపు



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ జిల్లా క్షయ నివారణ విభాగం (ఎన్‌టీఈపీ)లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు తమకు గత రెండు నెలల (మే, జూన్) వేతనాలు ఇప్పించాలని, వేతనాల జాప్యానికి గల కారణాలను తెలుసుకొని, పై అధికారులతో చర్చించి పరిష్కరించాలని కోరుతూ క్షయ నివారణాధికారి డాక్టర్ ఆచార్య పాత్రకు వినతిపత్రం సమర్పించారు. తమ హక్కుల సాధన కోసం జూలై 9న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఎన్‌టీఈపీ ఉద్యోగులకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో వరంగల్ క్షయ వ్యాధి ఉద్యోగులు ఎస్.టి.ఎల్.ఎస్.లు ఏ. రంజిత్, టి. శ్రీధర్, ఎస్.టీ.ఎస్.లు అశోక్, నరేష్, సుభాషిణి, టీ.బీ.హెచ్.వీ. సంకీర్తన మాధవి, డీ.పీ.పీ.ఎం. నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## సాంబయ్య గౌడ్ ను పరామర్శించిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట మనం దినపత్రిక విలేఖరి గౌని సాంబయ్య గౌడ్ ను టీడబ్ల్యూజేఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు టీవీ రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దామెర రాజేందర్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యదర్శి దామర వెంకటేష్, ఆంధ్రప్రభ కాజీపేట విలేకరి శ్యామ్ మంగళవారం ఆయన గృహంలో పరామర్శించారు. ఇటీవల మహబూబాబాద్ పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆయన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న సాంబయ్య గౌడ్ త్వరగా కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కాలంలో వరుసగా మరణిస్తున్న జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత చికిత్స అందించేలా హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

# డిఫాల్టర్ రైస్ మిల్లర్స్‌పై యాక్షన్

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- పలు అంశాలపై కలెక్టరేట్ లో సమీక్ష



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం డిఫాల్టర్ రైస్ మిల్స్, రేషన్ కార్డుల పంపిణీ, భూభారతి దరఖాస్తు పరిష్కారం, వన మహోత్సవం ఏర్పాట్లపై తహసిల్దార్లు, డీఎం సివిల్ సప్లయ్, డీసీఎస్ఓలతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో ఉన్న డిఫాల్టర్ రైస్ మిల్లర్ల జాబితాను సిద్ధం చేయాలని, సంబంధిత మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారంగా చర్యలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామసభలు, మీ సేవ కేంద్రాల ద్వారా స్వీకరించిన కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల వెరిఫికేషన్ వేగవంతం చేయాలని, రేషన్ కార్డుల్లో నెంబర్ యాడ్ చేయుటను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిబంధానల మేరకు ఖాళీగా ఉన్న రేషన్ షాపుల భర్తీకి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. రేషన్ కార్డు లబ్ధిదారులలో డెత్ కేసులు ఉన్నట్లయితే గ్రామపంచాయతీల నుంచి నివేదికలు సేకరించి వాటిని తొలగించాలన్నారు. భూభారతి ధరఖాస్తు పరిష్కారంపై సంబంధిత తహసీల్దార్లతో మాట్లాడుతూ వివిధ మండలాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణలో సేకరించిన దరఖాస్తుల ఆన్లైన్ నమోదు పనులు వేగవంతం చేయాలని సంబంధిత తహసిల్దార్లను ఆదేశించారు. జిల్లాలో మహిళా శక్తి, స్వయం సహాయక బృందాల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు కల్పించే ఉద్దేశ్యంతో మహిళా పెట్రోల్ బంక్ స్థాపనకు ప్రభుత్వ స్థలాలను గుర్తించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పీఎం కుసుమ ప్రాజెక్ట్ కింద సోలార్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలు నాటేందుకు ఒక్కొక్క మండలానికి ఐదు ఎకరాల చొప్పున ప్రభుత్వ స్థలాన్ని సేకరించి గ్రీనరీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, డీసీఎస్ఓ కిష్టయ్య, డీఎం సివిల్ సప్లయ్ సంధ్యారాణి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com